www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 డిసెంబరు 2023
5
పశ్చిమ గోదావరి

రెండు రోజులు సంతాప దినాలు

ఏలూరు, పశ్చిమ కలెక్టర్ల ప్రకటన

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 15, 16 తేదీల్లో రెండు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించిందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలలో విధిగా సంతాప దినాలను పాటించాలని పేర్కొన్నారు. కార్యాలయాల్లో ఏ విధమైన వేడుకలను నిర్వహించరాదని తెలిపారు.

మూగబోయిన ప్రజా గొంతుక

ప్రజా ఉద్యమాల ఊపిరి.. ఉపాధ్యాయ ఉద్యమాల ముద్దుబిడ్డ, పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ (56) శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పాటుపడే సాబ్జీ ఇక లేరనే విషయం తెలియగానే జిల్లావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

- రోడ్డు ప్రమాదంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి
- ఉండి మండలం చెరకువాడలో ఘటన
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయ, ఉద్యోగ నేతలు
- భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం
- నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు, జిల్లా అధికారులు
- ఉద్యమాలకు తీరని లోటు
- శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- ప్రజా ఉద్యమాల గొంతుక మూగబోయింది : ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - భీమవరం

సాబ్జీ శుక్రవారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఏలూరు నుంచి వి.శ్రీనివాసరావుకు చెందిన కారులో పిఎ ఆలీ, గన్‌మెన్ ఎస్.ముత్యాలరావుతో కలిసి భీమవరం బయల్దేరారు. మార్గమధ్యంలో ఏలూరు జిల్లా కైకలూరు, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో అంగన్వాడీల సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపారు. అక్కడ నుంచి భీమవరంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలకు సంఘీభావం తెలిపేందుకు భీమవరం బయల్దేరారు. ఉండి మండలం చెరుకువాడ వచ్చేసరికి ఎదురుగా భీమవరం నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న కారు ఎంఎల్‌సి సాబ్జీ కారను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సాబ్జీ నుదుటి భాగంలో బలమైన గాయం కావడంతోపాటు ఛాతిపైనా బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పిఎ ఆలీకి తీవ్ర గాయాలవ్వగా, కారు నడుపుతున్న శ్రీనివాసరావుకు, గన్‌మెన్‌కు గాయాలయ్యాయి. వీరిని భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సాబ్జీ భౌతికకాయాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి సాయంత్రం వరకూ సందర్శన నిమిత్తం అక్కడే ఉంచారు. ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి), యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి యుటిఎఫ్ పతాకాన్ని ఎంఎల్‌సి సాబ్జీ భౌతికకాయంపై ఉంచి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అక్కడకు చేరుకుని పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు పెద్దసంఖ్యలో ప్రభుత్వాసుపత్రికి తరలొచ్చారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లా కార్యదర్శులు బి.బలరాం, ఎ.రవి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, సిఐటియు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, యుటిఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తదితరులు నివాళులర్పించారు.

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. భౌతికకాయం వద్ద సాబ్జీ భార్య షేక్ షబానీ బేగం, కుమారుడు ఆజాద్, సోదరి జెరినా, బావ సుభాని కన్నీరుమున్నీరుగా విలపించారు.

తలకు బలమైన గాయం: జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్

ఎంఎల్‌సి సాబ్జీ మృతి బాధాకరమని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎంఎల్‌సి కారు ప్రమాదానికి గురైందన్నారు. ఎదురుగా వస్తున్న మరొక కారు సాబ్జీ కారును బలంగా ఢీకొందని తెలిపారు. ప్రమాదంలో సాబ్జీ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు.

ఉద్యమాలకు తీరని లోటు
శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

పేద ప్రజల, పలు సంఘాల గొంతుక ఎంఎల్‌సి సాబ్జీ అని, ఆయన మృతి అత్యంత బాధాకరమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోషేన్‌రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను శాసనమండలిలో లేవనెత్తి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో సాబ్జీకి ఎవరూ సాటిరారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సాబ్జీ మృతి తీవ్ర బాధాకరమన్నారు. ఆయన లేని లోటు ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు మంచి మిత్రులని, కొన్ని విషయాలు తాను కూడా అడిగి తెలుసుకునే వాడినని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనమండలి తరపున, వ్యక్తిగతంగానూ సాబ్జీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాబ్జీ మరణం దురదృష్టకరం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ఎంఎల్‌సి సాబ్జీ మృతి బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక గొంతుకగా ఉన్న సాబ్జీ మృతి జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. రైతులు, కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న సాబ్జీ తమకు పెద్దదిక్కని, ఆయన మృతి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యమాల గొంతుక మూగబోయింది
ఎంఎల్‌సి ఐవి

ఉద్యమాలే ఊపిరిగా పని చేస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ మృతి అత్యంత బాధాకరమని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్విరామంగా పని చేశారన్నారు. సాబ్జీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాబ్జీ మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి

డిప్యూటీ సిఎం కొట్టు సంతాపం

రోదిస్తున్న యుటిఎఫ్ నేతలు, ప్రజాసంఘాల నేతలు

తాడేపల్లిగూడెం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాబ్జీ టీచరుగా జీవితాన్ని ప్రారంభించి ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అత్యంత క్రియాశీలక పాత్ర వహించారని మంత్రి కొనియాడారు. ఎంఎల్‌సిగా గెలిచి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. సాబ్జీ మరణంతో జిల్లా ఒక మంచి పోరాట యోధుడిని, ఉద్యమ నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కొట్టు సత్యనారాయణ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిమ్మల, అంగర సంతాపం

పాలకొల్లు: రోడ్డు ప్రమాదంలో ఎంఎల్‌సి సాబ్జీ మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు అన్నారు. సాబ్జీ మృతి వ్యక్తిగతంగా తనకు, ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని సంతాపం తెలిపారు. సాబ్జీ సుదీర్ఘ పరిచయం ఉందని, నిత్యం పోరాడయోధుడిగా ఉండేవారని అంగర కొనియాడారు.

సిపిఎం సంతాపం

ఏలూరు అర్బన్: పిడిఎఫ్ ఎంఎల్‌సి సాబ్జీ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సాబ్జీ మృతి కుటుంబానికే కాకుండా ఉపాధ్యాయ ఉద్యమానికి, ప్రజాఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సాబ్జీ కృషిని, సహకారాన్ని మరవలేవని తెలిపారు. చివరి క్షణం వరకూ ప్రజా ఉద్యమాల్లో మమేకమయ్యారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

సిపిఐ, ఎఐటియుసి సంతాపం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి పట్ల సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏలూరు ఏరియా కార్యదర్శి అప్పలరాజు తీవ్ర సంతాపం తెలిపారు.

'మీరు చేస్తున్నది న్యాయమైన పోరాటం.. ముందున్నది మీరే..

ఆకివీడులో అంగన్వాడీలనుద్దేశించి ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చివరి మాటలు

అక్కడ నుంచి బయల్దేరిన 15 నిమిషాల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

'మీరు చేస్తున్నది న్యాయమైన పోరాటం. ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో సమస్యను తెలియజెప్పేందుకు ముందుగా బయటకు వచ్చింది మీరే. మీ బాటలోనే ఈనెల 22వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికుల సైతం సమ్మెబాట పట్టనున్నారు. క్రమంగా వారి వెంట స్కీమ్ వర్కర్లు ఒకొక్కరుగా వస్తారు.. మీరు ధైర్యంగా పోరాడండి, మేము అండగా ఉంటా' అంటూ ఎంఎల్‌సి సాబ్జీ ఆకివీడులో చేసిన చివరి ప్రసంగాన్ని గుర్తు చేసుకుంటూ అంగన్వాడీలు కన్నీటిపర్యంతమవుతున్నారు. అంగన్వాడీలు, ఆశాలకు సంఘీభావం తెలిపేందుకు ఏలూరు నుంచి బయల్దేరిన ఎంఎల్‌సి సాబ్జీ మార్గమధ్యంలో ఏలూరు జిల్లా కైకలూరు, అనంతరం ఆకివీడులోని అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. 11.35 నిమిషాలకు ఆకివీడులోని సమ్మె శిబిరానికి చేరుకున్న సాబ్జీ అక్కడ మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని చెప్పారు. 11.44 గంటలకు ప్రసంగం ముగించిన సాబ్జీ ఎదురుగా ఉన్న టీ స్టాల్‌లో టీ తాగి వెంటనే బయల్దేరారు. 12:08 నిమిషాలకు ఎంఎల్‌సి కారుకు ప్రమాదం జరిగిందనే సమాచారం అందింది. కొద్దిసేపటికే సాబ్జీ మృతి చెందారని తెలియడంతో అంగన్వాడీలు కన్నీరుమున్నీరయ్యారు. సాబ్జీ మృతి పట్ల సంతాపం తెలిపి నివాళులర్పించారు.

ఎంఎల్‌సిగా గెలుపు.. ఓ సంచలనమే..!

7,987 మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం

కార్పొరేట్ ఉద్దండులను మట్టికరిపించి విజయకేతనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా షేక్ సాబ్జీ గెలుపు ఒక సంచలనమేనని చెప్పాలి. కార్పొరేట్ ఉద్దండులను సైతం మట్టికరిపించి ఎంఎల్‌సిగా విజయం సాధించారు. 2021 మార్చి 14న ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా ఎవరిని బరిలోకి దింపాలా అనే చర్చ పెద్దఎత్తున సాగింది. 30 ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న సాబ్జీవైపే అంతా మొగ్గుచూపారు. అయితే ఆయనకు ఉపాధ్యాయునిగా ఐదేళ్ల సర్వీసు ఉంది. అయినప్పటికీ పెద్దల నిర్ణయాన్ని గౌరవించి ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసి ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తం 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉభయగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు గతంలో చేదు అనుభవాలే మిగిలాయి. సాబ్జీకి ముందు రాము సూర్యారావు సైతం రెండో ప్రాధాన్యత ఓటుతో గెలిచారు. దీంతో సాబ్జీ గెలుపుపై పలువురు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయనను ఓడించేందుకు కార్పొరేట్ అభ్యర్థి అన్ని ప్రయత్నాలూ చేశారు. అయితే అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ తొలిప్రాధాన్యత ఓటుగా 7,987 ఓట్లు సాధించడంతో 50 శాతం మార్కును సాబ్జి దాటేశారు. ప్రత్యర్థిపై 1534 ఓట్లతో తొలిప్రాధాన్యత ఓట్ల మెజార్టీతోనే ఎంఎల్‌సిగా గెలిచారు.

సాబ్జీ సంతాప సభలో నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, నేతలు

రోదిస్తున్న సాబ్జీ భార్య, పక్కనే ఎంఎల్‌సి లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర నేత వెంకటేశ్వర్లు

నా తండ్రి మృతిపై అనుమానాలున్నాయి

సాబ్జీ కుమారుడు ఆజాద్

భీమవరం: తన తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, ప్రమాదంపై సిబిసిఐడి విచారణ జరిపించాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కుమారుడు ఆజాద్ కోరారు. తొలుత సాబ్జీ సోదరుడు ప్రమాదంపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సాబ్జీ కుమారుడు మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న కారు 140 కిలోమీటర్ల వేగంతో వచ్చి ఢీకొందని, దీనిపై అనుమానాలున్నాయని తెలిపారు.

పోస్టుమార్టం ఇలానే చేస్తారా

భీమవరం: సాబ్జీ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహణలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తాయి. పోస్టుమార్టం అనంతరం సాబ్జీ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తుండగా తల నుంచి రక్తం కారిది. దీంతో కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పోస్టుమార్టం ఏం చేశారని, ఒక ఎంఎల్‌సికే ఇలా చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. దీంతో అధికారులు అప్రమత్తమై సాబ్జీ భౌతికకాయాన్ని మళ్లీ మార్చురీకి తీసుకెళ్లారు.

సాబ్జీ భౌతికకాయం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలింపు

కుమార్తె అమెరికా నుంచి వచ్చాక ఏలూరులో అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ భౌతికకాయానికి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి శుక్రవారం రాత్రి ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. సాబ్జీ కుమార్తె అస్రిఫ్ అమెరికాలో ఉన్నారు. ఆమె ఆదివారం ఇక్కడకు చేరుకునే అవకాశం ఉంది. కుమార్తె వచ్చాక సాబ్జీ భౌతికకాయాన్ని ఏలూరులోని సాబ్జీ నివాసం వద్దకు తీసుకెళ్లి అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం, లేదా సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది.

సాబ్జీ మృతి తీరనిలోటు

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి

భీమవరం రూరల్: ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మరణం తీరని లోటని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సాబ్జీ మృతిపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

ఆశాల 36 గంటల ధర్నా విజయవంతం

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం మరింత ఉధృతం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశాలు కలెక్టరేట్ వద్ద గురు, శుక్రవారాల్లో చేపట్టిన 36 గంటల ధర్నా విజయవంతమైంది. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ఆశాలు పెద్దసంఖ్యలో కలెక్టరేట్ వద్ద ధర్నా ప్రాంగణానికి చేరుకున్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గురువారం రాత్రి బహిరంగ ప్రదేశంలో ఒకపక్క దోమలు, మరోపక్క చలిని సైతం లెక్క చేయకుండా ధర్నా శిబిరంలోనే బస చేశారు. ఉదయం అల్పాహారం అనంతరం తమ ధర్నా ప్రారంభించి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ ఆశాలు విధి నిర్వహణలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఆశాలకు వర్తింపజేయాలని, రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. అనంతరం ఆశాలు కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. దీనిపై డిఎంహెచ్‌ఒ స్పందించి మాట్లాడుతూ ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి దిగుపాటి జ్యోతి, నేతలు లారెన్స్ కుమారి, బేగం, ఆదిలక్ష్మి, దేవి, పద్మ, రాజేశ్వరి, స్రవంతి, దీపిక, రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా నేతలు బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, జవ్వాది శ్రీను, బి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

టిడిపి నేతల సంఘీభావం

మూడు నెలల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని, తమ ప్రభుత్వం రాగానే ఆశాలు, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆశాల ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గంటా త్రిమూర్తులు, వి.రాఘవులు, బి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

బెదిరేదే లేదు..

జిల్లాలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పలు మండలాల్లో అంగన్‌వాడీలు నల్ల చీరలు ధరించి, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి వినతిపత్రాలు సమర్పించారు. అలాగే పలు చోట్ల అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టారు. - 6లో

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలు సైతం త్యాగం చేసిన గొప్ప మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన త్యాగాన్ని మరువరాదని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, అవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. శ్రీరాములు త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా, మండల సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెసిఐ రైజింగ్ క్లబ్ ప్రెసిడెంట్ మామిడి కౌశిక్, మౌని కావలి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర అవతరణకు ముఖ్యపాత్ర పోషించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లులో బాపు విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపు విగ్రహాన్ని శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు శుక్రవారం ఆవిష్కరించారు. శుక్రవారం మార్కెట్లో సంఘం భవనం వద్ద ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో కళాకారుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బాపు విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళాకారులు మరో 10 మంది కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి, యడ్ల తాతాజీ, సంఘం అధ్యక్షులు నీలం రవి, కార్యదర్శి సమతం చంద్రరావు, కోశాధికారి బొప్పే సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపు చిత్రకళా పోటీలు నిర్వహించారు.



బాపు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మోషేనురాజు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

భవిష్యత్తు గ్యారెంటీ టిడిపి, జనసేన లక్ష్యం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి ఇంటికీ భవిష్యత్తు గ్యారంటీ టిడిపి, జనసేన లక్ష్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కాళ్లకూరులో టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటికీ రాంబాబు, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇప్పుడున్న పథకాల కంటే మేలైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. వైసిపి పాలన భవిష్యత్ తరాలను పూర్తిగా నాశనం చేసేలా కొనసాగుతోందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. టిడిపితో ఆగిపోయి ఎన్నికల్లో టిడిపికే ఓటు వేయాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన మోసకారితనాన్ని ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళా శక్తి పేరుతో సూపర్ సిక్స్ అనే పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జివి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, మంతెన పెద నరసింహరాజు, బండారు వేణు, మాదవరావు, పుప్పాల వాసు, పివి.రామరాజు, అడ్డాల మోహన్‌రాజు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

కొణితివాడ తాడూరి శ్రీరామచంద్ర జగన్నాథరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్కూల్ పూర్వ విద్యార్థులు కంప్యూటర్ బహూకరించారు. శుక్రవారం 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు తరఫున నాగరాజు సుబ్బరాజు, పెదపూడి వెంకట సత్యనారాయణ, చిక్కాల రవికుమార్ రూ.నలభై ఒక్క వేల విలువైన డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను ప్రధానోపాధ్యాయులు మండా రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠాలు నేర్పిన పాఠశాలకు కంప్యూటర్ బహూకరించడం అభినందనీయమన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు నుంచి వెలివెల వెళ్లే రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు రోడ్డు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బి ఎఇ మల్లికార్జున్ వివరణ అడుగగా 5.1 కిలోమీటర్ల తారు రోడ్డును, 500 మీటర్ల సిమెంటు రోడ్డును వేయడానికి మూడు కోట్ల రూపాయలు ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ప్రస్తుతం ఆ పనులు నాణ్యతలో లోపం లేకుండా శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దగ్గరుండి పనులను పరిశీలిస్తున్నామని తెలియజేశారు. అలాగే మరికొన్ని రోడ్లను కూడా త్వరలో నిర్మిస్తామన్నారు. ఈ రోడ్డు పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

బాధితులకు ధర్మారావు ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడంలో ధర్మారావు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. ఆగర్రు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఉన్నమట్ల రవీంద్రబాబు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అతని కుటుంబం నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకొని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. విజయభాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రావూరి వెంకట అప్పారావు, పీతల శ్రీనివాస్, ధనాని సూర్యప్రకాష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కోడి విజయ భాస్కర్ పాల్గొన్నారు.

'రాష్ట్రానికి జగనన్న అవసరం'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రానికి జగనన్న అవసరం ఎంతో ఉందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలిలో సుబ్రహ్మణ్యం స్వామి గుడి వద్ద రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారామ్ మాట్లాడారు. దేశంలో ఏ నాయకుడూ అమలు చేయని అనేక సంక్షేమ పథకాలను జగనన్న ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేసే ఏకైక నేత జగనన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యఖ్యమిల్లి బేబీ రాజేష్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన మృత్తిక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరిగిన ప్రపంచ మృత్తిక దినోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలు సస్య ఏడిఆర్ ఎం.భరతలక్ష్మి అసోసియేట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూసార లక్ష్మి మాట్లాడారు. విచక్షణ రహితంగా ఎరువులు, ఇతర రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు కలుషితం అవుతున్నాయన్నారు. అనంతరం మార్టేరు సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికులను నట్టేట ముంచారు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నాడు పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు తుంగలోతొక్కడమే కాకుండా, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని, ఇప్పటికీ ఇవ్వకపోవడం సిగ్గుచేటని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం కల్లు గీత అధ్యక్షుల సమావేశం దాసరి సూరిబాబు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు గీత వృత్తిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా గీతన్నలు గాలికి వదిలేస్తున్నారని తెలిపారు. వృత్తిలో చనిపోయిన, వికలాంగులైన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడాన్ని విమర్శించారు. బాధలు, కష్టాలు గురించి ఆలోచించే పాలకులు వస్తే తప్ప వీరి బతుకులలో మార్పు రాదన్నారు. గీత వృత్తి శిక్షణతో సంక్షేమ పథకాలు అమలులో కేరళ రాష్ట్రం ఆదర్శంగా ఉందన్నారు. గీత వృత్తి రక్షణ కోసం, పెన్షన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి దాసరి స్వర్ణబాబు, పెచ్చెట్టి శ్రీనివాసరావు, సుబ్బారావు, చిటికెన సత్తిపండు, పెచ్చెట్టి కనకారావు, రాజుబసాపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఉద్యోగ మేళా

తాడేపల్లిగూడెం:స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ సదర్ లాండ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాలో జిల్లాలోని అన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 1100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ పి.లక్ష్మీరాజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య అందిస్తే ఉద్యోగాలు, లక్షల జీతాలు అని విద్యార్థులు తమ భవిష్యత్తు తీర్చిదిద్దుకునేందుకు మంచి అవకాశాలు కల్పిస్తుందని మరోసారి నిరూపణ అయ్యిందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, ఏలూరు నుండి విచ్చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

పితాని నియామకంపై హర్షం

పోడూరు:బిసి సంక్షేమ శాఖ అనుబంధ కమిటీకి ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఎంఎల్ఏ పితాని సత్యనారాయణను చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ సందర్భంగా ఆ నియామకం పట్ల పరిధిలోని బిసి సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఆయనను కొమ్మిల్చరువులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బెదిరేదే లేదు..

పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టిన అధికారులు
నల్ల చీరలు ధరించి, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన
నాలుగోరోజు కొనసాగిన ఆందోళనలు

పాలకొల్లులో నిరసన తెలుపున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

అంగన్‌వాడీలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. నాలుగో రోజు సమ్మెలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కోర్టు నుంచి నరేంద్ర సెంటర్, తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమాజానికి ఎన్నో సేవలందిస్తున్నారన్నారు. సమాజానికి సేవలందించే వారిపట్ల ప్రభుత్వాలు ఇంత నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.ఝాన్సీ, అజయ కుమారి మాట్లాడారు. సమ్మెకు ఎపిటిఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు రాజగోపాల్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎన్.ఆదినారాయణ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బళ్ల చిన వీరభద్రం, టిడిపి మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మద్దతు తెలిపారు.

తాడేపల్లిగూడెం : ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీల బతుకులు మరడంలేదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నాలుగో రోజు కళ్లకు గంతలు కట్టుకుని సమ్మె చేపట్టారు. సమ్మెకు సిఐటియు పట్టణ కమిటీ, స్థానిక సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాడేపల్లిగూడెం ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపరాణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పెంటపాడు : గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నాలుగోరోజు నిరసన తెలిపారు. సమ్మెకు సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, టిడిపి నాయకులు వలవల బాబ్జి, పెంటపాడు మండల నాయకులు దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు మద్దతు తెలిపారు. సభకు ఆర్.అనురాధ నాయకత్వం వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఇ.వెంకటలక్ష్మి, నాగమణి, గాయత్రి, గంగాభవానీ, కనకమహాలక్ష్మి, హైమావతి, కె.మంగతాయారు, లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

వీరవసరం : నాలుగో రోజు అంగన్‌వాడీలు వీరవాసరం సెంటర్లో నల్ల చీరలు ధరించి, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సమ్మెకు ఐద్వా జిల్లా నాయకురాలు జయప్రభ మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా నాయకులు డి.కళ్యాణి, ఎమ్‌డి హసీనా, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, అంగన్‌వాడీ నాయకులు పి.నాగరత్నం, నిర్మల, లక్ష్మీ, వెంకటలక్ష్మి, శాంతకుమారి, నాగపార్వతి పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం ఆపాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డికి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ దొరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ తులసి మాట్లాడారు. సమ్మెకు జనసేన నాయకులు, ఐకెపి విఒఎలు, ఎస్‌టియు, ఉపాధ్యాయ సంఘం నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు వి.రాధ, ఎన్.ఉషశ్రీ, కెయు ఎం.భవాని, నాగలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీలు న్యాయపోరాటం చేస్తుంటే అధికారులు అడ్డు తగలడం దారుణమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు విమర్శించారు. మొగల్తూరులో దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, ఆదూరి సాంబమూర్తి, మెండు రాజేష్, ముక్కు పుల్లయ్య, రాంబాబు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, పార్టీ సభ్యులతో సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. అలాగే సమ్మెకు కాపు నియోజకవర్గ నాయకులు కోటిపల్లి సురేష్, తమ్మిశెట్టి బాబ్జి, చెన్నా రమేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ దొండపాటి స్వాములు, జనసేన నాయకులు వర్దనపు ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మద్దతు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా స్టీమర్ రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి, తహశీల్దార్ మహమ్మద్ పాజిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, చేనేత కార్మికుల సంఘం నాయకులు వాసా రామలింగం పాల్గొన్నారు.

పోడూరు : నాలుగో రోజు నల్ల చీరలు ధరించి అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సమ్మెకు యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకె వి.రామభద్రం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎంవి.రాజశేఖర్, మండల అధ్యక్షులు దాసరి క్షేమమూర్తి, ప్రధాన కార్యదర్శి కేతా నాగరాజు, సిఐటియు కౌన్సిల్ సభ్యులు పిల్లి.ప్రసాద్, అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్ పీతల రాజమణి, రాయుడు కుమారి పాల్గొన్నారు.

ఉండి : అంగన్‌వాడీలతో చర్చలు జరపకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం దుర్మార్గమని ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీలు నల్లరంగు చీరలు ధరించి, కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, చెన్నంశెట్టి హరినాయుడు, జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న, కందుల బలరాం, మజ్జి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. నాలుగోరోజు దీక్షలో భాగంగా రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహశీల్దార్ జి.అనితకుమారికి, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, రాజి, రేఖ, శాంభవి పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం నల్ల చీరలు ధరించి, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

భీమవరం, భీమవరం రూరల్ : అంగన్‌వాడీలు నాలుగో రోజు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడారు. సమ్మెకు జనసేన జిల్లా అధ్యక్షులు పోటికలపూడి గోవిందరావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, సుంకర రవి, భీమవరం మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, నాగిడి శ్రీనివాస్, మగాపు భగత్‌సింగ్, కాళీ శేఖర్, అమరపల్లి సతీష్, వీరమల్లు శ్రీను, తుంపాల శ్రీను, కృష్ణ, కార్తీక్, రైతు సంఘం నాయకులు సిహెచ్.వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, దుర్గ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో 4వ రోజు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నల్ల చీరలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజుకు వినతి పత్రం సమర్పించారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్‌వాడీలు నాలుగో రోజు నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ దండు అశోక్‌వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులకు టిడిపి నాయకులు గంటా వాసు, కడలి ఏడుకొండలు, కట్టా శ్రీను, ఎన్.వెంకటేష్, ఎస్.సుభాకర్ రూ.10 వేల విరాళం ఇచ్చారు. అలాగే సివిల్ సప్లై కార్మికులు గంటి ఆంజనేయులు, బొంతు ఏడుకొండలు, కార్మికులు, పంచాయతీ కార్మికులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సాయి, మహాలక్ష్మి, మౌనిక, భవాని, సరస్వతి పాల్గొన్నారు.

సరిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తీయడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్న స్థానికులు, సిఐటియు నాయకులు

తాళాలు బద్దలు కొట్టి బెదిరింపులు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

అంగన్‌వాడీల సమ్మె కారణంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను సమీప పాఠశాల, స్థానిక సచివాలయ ఉద్యోగులకు బాధ్యతను అప్పగించినట్లు ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో నెగ్గిపూడి, వెలగలేరు, పెనుమంట్ర, పొలమూరు, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరుతో పాటు ఆయా గ్రామాల్లో కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో తెరిపించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎన్ఎంలు బాధ్యత వహిస్తారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు దగ్గర ఉన్న కేంద్రాలను ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుంటారని తెలిపారు.

ఆచంట : అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తితో అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేతా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నాలుగో రోజు దీక్షల్లో అంగన్‌వాడీలు నల్ల చీరలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం స్థానిక కచేరీ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఆచంటలో ఎంపిడిఒ ఆదేశాల మేరకు ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు అయోధ్యలంక గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు పగలగొట్టారు. ఒక పక్క అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతుంటే మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, నాయకులు సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, టి.బుల్లబ్బాయి, దాసిరెడ్డి కోటేశ్వరరావు, తోటపల్లి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు.

ఉండి : అంగన్‌వాడీలు నాలుగు రోజుల నుంచి సమ్మెలో పాల్గొనడంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలం వ్యాప్తంగా సచివాలయ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న స్టాక్, తాళాలను సమీపంలోని మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఉండి కాపులపేటలోని అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టే సమయానికి స్థానిక వార్డు సభ్యులు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు అడ్డుకున్నారు. లబ్ధిదారులు కలిపిండి లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త ఉంటేనే తమ పిల్లలను కేంద్రాలకు పంపిస్తామని లేని పక్షంలో పంపించేది లేదని తేల్చి చెప్పారు. గత్యంతరం లేని పరిస్థితిలో అధికారులు వెనక్కి వెళ్లిపోవడం విశేషం.

పాలకొల్లు రూరల్ : మండలంలోని ఆగర్రు, లంకల కోడేరు, పూలపల్లి తదితర గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వైసిపి నేతలు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టారు. పీడీ సుజాత రాణి, సిడిపిఒ ఇందిర, సూపర్‌వైజర్ సత్యవేణి దగ్గరుండి అంగన్‌వాడీ సెంటర్లు తెరిచేలా చేశారని అంగన్‌వాడీలు ఆవేదన చెందారు.

గణపవరం : సమస్యలు పరిష్కరించాలని నాలుగు రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టే ప్రయత్నం శుక్రవారం చేపట్టింది. సరిపల్లిలోని ఎస్‌సి పేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవడానికి ప్రయత్నిస్తున్న అధికారులను స్థానికులు, సిఐటియు నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా అధికారులు అక్రమంగా తలుపులు పగలగొట్టడం పద్ధతి కాదన్నారు. దీంతో అధికారులు తాళాలు పగలగొట్టకుండా వెనక్కి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను అధికారులు పగలగొట్టారు. నామమాత్రంగా తాళాలు పెట్టినప్పటికీ సెంటర్లకు విద్యార్థులు గాని, తల్లిదండ్రులు గానీ రాకపోవడం గమనార్హం. తాళాలు తీసిన ఏ సెంటర్‌కూ పిల్లలు రాలేదని ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి పి.వాణి తెలిపారు.

మొగల్తూరు : శుక్రవారం సాయంత్రం శేరేపాలెంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను ఎంపిడిఒ ఉండు బాబ్జీరాజు, సిడిపిఒ ఊర్మిళ, పంచాయతీ కార్యదర్శి జయరాజు, మహిళా పోలీస్ బేబీ పర్యవేక్షణలో పగలగొట్టారు. కెపి పాలెంలో తాళాలు పగలగొట్టేందుకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెను తిరిగారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్త సౌభాగ్యవతి

గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త..

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీల సమ్మె నాలుగు రోజు కొనసాగింది. పట్టణంలోని పదో వార్డు సెక్టార్ ఒకటి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఎం.సౌభాగ్యవతి తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ఆమె పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రం తాళాన్ని అధికారులు బద్దలు కొడుతున్నారన్న సమాచారం విన్న సౌభాగ్యవతి ఆందోళనకు గురై పక్కన ఉన్న సిమెంట్ బల్లపై కూర్చోబోతుండగా ఒక్కసారిగా పక్కనే ఉన్న కుక్కలగుంపు ఆమెపై దాడి చేశాయి. ఈ క్రమంలో సమ్మెలో పాల్గొన్న తోటి కార్యకర్తలు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి ఆమె కుడిచేయి విరిగినట్లు తెలిపారు. ఎముకల డాక్టర్ లేకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

మొగల్తూరు : అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తీస్తున్న అధికారులు

రాష్ట్ర బిసి సెల్ జాయింట్ సెక్రటరీగా సత్యనారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె గ్రామానికి చెందిన బాలం సత్యనారాయణ రాష్ట్ర బిసి సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. సిఎం జగన్ రాష్ట్ర బిసి విభాగం కమిటీని గురువారం ప్రకటించారు. ఈ కమిటీలో కోపల్లె గ్రామానికి చెందిన బాలం సత్యనారాయణ నియామకం కావడం పట్ల మండల బిసి సెల్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర బిసి విభాగ కమిటీలో జాయింట్ సెక్రటరీగా నియమించిన సిఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

'హామీల అమలు ఘనత జగన్‌దే'

భీమవరం రూరల్: 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే మాత్రమే దక్కిందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణానికి సంబంధించి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డులో కూడా గత నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. అమత పథకంలో నిర్మించిన మూడు రిజర్వాయర్లను త్వరలోనే ప్రజా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు.

న్యాయవాదుల నిరసన

నరసాపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం వారు పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం నాయకులు పుల్లాజీ, కురెళ్ల సోమశేఖర్, దొంగ సుభాష్‌బాబు మాట్లాడారు.

పాస్‌పోర్టు పోయినది

GUBBALA MUTYALA RAO అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-09-2022న W2915146 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.04-12-2023 న లక్ష్మణేశ్వరం గ్రామం నుండి నరసాపురం పట్టణం, మెయిన్‌రోడ్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GUBBALA MUTYALA RAO
S/o. G. Brahmaji Rao
D.No. 2-266, Devuni Thota,, Lakshmaneswara Post
Narasapuram Mandal, W.G.Dt, A.P.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు నందు
ఇ.పి.నెం. 131/2015 ఇన్ ఒ.యస్.నెం.1297/2013

బిట్వీన్ :
అవుతు మధుసూధనరెడ్డి - డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీమతి బొర్రా కృష్ణవందన - జె.డిఆర్.

పై నెంబరు గ్రంధము నందు డిక్రీ బాకీ వగైరాలు వసూలు నిమిత్తము గాను యీ దిగువ షెడ్యూలు దాకలా జె.డిఆర్ గారికి చెందిన ఆస్తిని ది.05-01-2024వ తేదీ ఉదయం గం.10-30ని॥ల సమయం నుంచి పై కోర్టు వారి యెదుట వేలం వేయుదురు. ఆసక్తి గల పాటదారులు వేలంలో పాల్గొనవచ్చును. మిగిలిన వివరాలకు కోర్టు నజారత్‌లో గాని, డి.హెచ్ఆర్ తరపున న్యాయవాది గారిని గాని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

లోగడ పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు సబ్-డి, పెదవేగి మండలం, రామశింగవరం గ్రామ పంచాయితీ ఆర్.యస్.నెం. 88/3ఎ, 17ఎ నందలి య.2-00ట్లు వ్యవసాయ మెట్ట భూమికి హద్దులు ::
తూర్పు - నడకదారి కొంత, కొడాలి రాఘవయ్య గారి భూమి కొంత మరియు తుంపాల అప్పారావు గారి భూమి కొంత వరకు
దక్షిణం - బొర్రా కృష్ణవందన గారి స్థలం
పడమర-బంగారు వెంకటేశ్వరరావు మరియు ఇ.రాము గార్ల భూమి
ఉత్తరం - మొమమ్మద్ షఫీవుల్లా గారి భూమి
యీ హద్దుల మధ్య య.2-00ట్లు భూమిని సమస్త యీజుమెంటరీ మరియు సర్వ హక్కులతో సహా వేలం వేయబడును.

డి.హెచ్ఆర్ గారి విలువ : రూ. 8,00,000/-లు
జె.డిఆర్. గారి విలువ : పేర్కొనబడలేదు.
అమీనా గారి విలువ : రూ.8,50,000/-లు

సబ్ రిజిష్ట్రారు గారి మార్కెట్ విలువ రీత్యా ఎకరా 1కి రూ.15,00,000/-లు విలువ కలిగియున్నది. వేలం సమయమందు పాట ప్రారంభ ధర కోర్టు వారు నిర్ణయించుదురు.

షెడ్యూలు ఆస్తి మీద ఎటువంటి ఎన్‌కంబరెన్స్ లేవు.
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గమనిక : షెడ్యూలు ఆస్తిని కోర్టు వారు జప్తు చేసిన పిదప జె.డిఆర్ అయిన బొర్రా కృష్ణవందన ఆమె కుమార్తె అయిన ముదిరెడ్డి ప్రేమతులసికు రిజిష్టర్డ్ దఖలు దస్తావేజు నెం. 6433/2015 రుమ వ్రాయించినారు. సదరు దఖలు దస్తావేజు చెల్లదు. మరియు సదరు ముదిరెడ్డి ప్రేమతులసి పై కోర్టు వారి ముందు దాఖలు చేసిన క్లయిమ్ అప్లికేషన్‌ను కోర్టువారు డిస్మిస్ చేసియున్నారు. కావున షెడ్యూలు ఆస్థి మీద ఎటువంటి ఎన్‌కంబరెన్స్ లేవు.

శ్రీ కూరపాటి పృథ్వీరాజ్, శ్రీ గోళ్ళ గోవింద శ్రీచరణ్
అడ్వకేట్స్, ఏలూరు, ఫోన్ : 8019826216, 9247163349
ఏలూరు, తేది : 15-12-2023

NOTICE

IN THE COURT OF THE 1ST ADDL DISTRICT & SESSIONS JUDGE, WEST GODAVARI, ELURU
Crl.A.NO.215/2023

Between :
Donthamsetti Suhasini ..Petitioner/Appellant
and
1) Deekonda Babuji
2) The State, rep. by its APP, W.G, Eluru
..Respondents/Respondents

PETITIONER/PETITIONER:
Donthamsetti Subhashini, W/o Tagore, Hindu, Female, aged 37 years, R/o D.No.7C-8/1-3, 7th Division, Opposite Little Star Convent, Eastern Street, Eluru, W.G.Dist.

RESPONDENT/RESPONDENT:
1. Deekonda Babuji, S/o Late D.K.Balaiah, Hindu, Male, Aged 44 years, R/o Flat No.302, Kalyani Apartments, Ashok Nagar, Eluru, W.G.Dist., Eluru JCJC
2. State Rep., by P.P Westgodavari Dt., Eluru

The petitioner/appellant filed appeal against the 1st respondent by name Deekonda Babuji whereas the Hon'ble court was pleased to ordered notice to you and posted the matter to 18-12-2023 for your appearance, therefore you are informed to appear before the Hon'ble court on 18-12-2023 at 10.30a.m and state your objections if any, else the matter will be decided according to law.

N.V.SATYANARAYANA
ADVOCATE, ELURU
CELL: 9866034418